


తిరుపతి జిల్లా ఎస్పీగా హర్షవర్ధన్ రాజు



హర్షవర్ధన్‌రాజు



సుబ్బరాయుడు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి జిల్లా ఎస్పీగా హర్షవర్ధన్ రాజును, ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధిత ప్రత్యేక కార్యదళం ఎస్పీగా సుబ్బరాయుడును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ఉత్తర్వులను జారీ చేశారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ఐపీఎస్ అధికారులకు బదిలీలు, పోస్టింగులను కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. గతంలో తిరుపతి జిల్లాలో ఎస్పీలుగా విధులు నిర్వర్తించిన హర్షవర్ధన్ రాజు, సుబ్బరాయుడును ఒకే జిల్లాలో ప్రభుత్వం పోస్టింగ్స్ ఇచ్చింది.



జనసంద్రం... పక్షుల కేంద్రం..!

ముగిసిన ఫ్లెమింగో ఫెస్టివల్



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో, సూళ్లూరుపేట

నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రం జనసంద్రంగా మారింది.. శుక్రవారం 18వ తేదీ ప్రారంభమైన ఫ్లెమింగో పక్షుల పండగ సోమవారంతో ముగిసింది. 'ప్రతి ఒక్కరూ నేలపట్టు సందర్శించి ప్రకృతిని ఆస్వాదించాలి' అన్న కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ పిలుపు మేరకు విద్యార్థులు, ప్రకృతి ప్రేమికులు కుటుంబ సమేతంగా విచ్చేసి వీక్షించారు. ప్రకృతి ఒడిలో పక్షుల వీక్షణ సందర్శకులకు అందమైన అనుభూతిని మిగిల్చింది. మూడో రోజు మంత్రులు ఆనం రాంనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్ విచ్చేశారు. కలెక్టర్ బైనాక్యులర్‌తో పక్షులను వీక్షించారు.

సూళ్లూరుపేటలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న ఫ్లెమింగో ఫెస్టివల్ -2025 రోజు వారీ కార్యక్రమంలో భాగంగా ముగింపు రోజైన 3వ రోజు సోమవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం వరకు క్రీడా పోటీలు జరిగాయి. సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు వివిధ పాఠశాల విద్యార్థులకు సాంస్కృతిక పోటీలు, సాయంత్రం 5 నుండి 7 వరకు సాంప్రదాయ సంస్కృతియ వేడుకలు జరిగాయి. రాత్రి 7 గంటల నుండి ప్రముఖ కళాకారులచే సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ అలరించాయి. ఉప్పెన చిత్రం హీరోయిన్ కతి చెట్టి, సింగర్ మంగ్లీ, యాంకర్ రవి, సింగర్ రితీష్ రావు, సాయి దేవ హర్ష, నాదా ప్రియా, వల్లి గాయత్రి, ఢీ కొరియోగ్రాఫర్ మణికంఠ, ఢీ డాన్సర్ తేజస్వి, ఢీ డాన్సర్ భూమిక, ఇమిటేషన్ రాజు, మల్కాంత్ సింగ్, దేవా, యాంకర్ కావ్య తదితర కళాకారుల కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. కొరియోగ్రాఫర్ సత్య డ్యాన్స్ షో అందరినీ అలరించాయి.

బస్సుల్లో విద్యార్థుల తరలింపు

కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను ఫ్లెమింగో పండుగకు తరలించారు. 20న సోమవారం తిరుపతి జిల్లాలోని మూడు డివిజన్లు (తిరుపతి, పుత్తూరు, గూడూరు) నుండి సుమారు 3600 మంది విద్యార్థిని విద్యార్థులు, 370 మంది ఎస్కార్ట్ ఉపాధ్యాయులతో నేలపట్టు పక్షులు రక్షిత కేంద్రము, అటకాని తిప్ప పక్షులు రక్షిత కేంద్రం, బీములవారిపాలెం, శ్రీ సిటీ ప్రభుత్వ జూనియర్ కళాశాల సూళ్లూరుపేట లోని స్టాల్స్‌ను సందర్శించారు. విద్యార్థినీ విద్యార్థులకు దొరవారిసత్రంలోని బిసి వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలో భోజన వసతి కల్పించారు. దాదాపు 2,750 మంది విద్యార్థులు భోజన వసతిని ఉపయోగించుకున్నారని జిల్లా విద్యాశాఖ అధికారి కెవిఎన్ కుమార్ తెలిపారు.

బస్సుల్లేక ప్రయాణికుల ఇక్కట్లు

సూళ్లూరుపేటలో... : ఫ్లెమింగో పక్షుల పండుగకు విచ్చేసిన కొంతమంది పర్యాటకులు బస్సుల్లేక ఇబ్బందులు పడ్డారు. ఉచిత బస్సులని చెప్పినా, తీరా బస్సులు ఉండే స్థలానికి వస్తే బస్సులు లేక ఉసూరుమంటూ ఆటోలను ఆశ్రయించారు. ఉదయం 8 గంటల నుంచి ఇబ్బంది పడుతున్నా పట్టించుకునేవారు లేరంటూ వాపోయారు. వేరే గత్యంతరం లేక ఆటోలను ఆశ్రయిస్తున్నామని, తమకు ఏమైనా అయితే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు.

రూ.100 కోట్లతో పులికాట్ ముఖద్వారాల పూడికతీత

సూళ్లూరుపేట ఫ్లెమింగో ఫెస్టివల్ మూడవరోజు ముగింపు కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ ఫ్లెమింగో ఫెస్టివల్‌ను 2001లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పునాది వేశారన్నారు. అప్పటినుంచి ఈ ఫెస్టివల్ ను స్టేట్ ఫెస్టివల్ గా మార్చడం జరిగింది. గత నాలుగు సంవత్సరాలుగా ఈ ఫ్లెమింగో ఫెస్టివల్ జరగలేదు. 75 రకాల పక్షులు వస్తుంటాయని తెలిపారు. 100 కోట్లతో పులికాట్ ముఖ ద్వారాలు పూడిక తీత పనులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిధులు మంజూరు చేశారని, ఆ నిధులతో త్వరలో పనులు జరుగుతాయని తెలిపారు. అనంతరం క్రీడలలో ప్రథమ, ద్వితీయ,తృతీయ స్థానాలు సాధించిన వారికి బహుమతులను మంత్రులు, ఎమ్మెల్యేల చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి,వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ,శ్రీ కాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయ శ్రీ,చీరాల ఎమ్మెల్యే ఎం.ఎం. కొండయ్య,గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్,మాజీ మంత్రి పరసా వెంకటరత్నం,మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రహ్మణ్యం,శ్రీ సిటీ చైర్మన్ రవి సన్నారెడ్డి ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, కొండేపాటి గంగా ప్రసాద్, నానాజీ, తదితర నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

జ్వరం గుప్పెట్లో చియ్యవరం

- నెలరోజులుగా డెంగీ, చికున్‌గున్యా తిష్ట
- అంతంతమాత్రంగానే వైద్య సేవలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం చియ్యవరం గ్రామంలో విష జ్వరాలు స్వైర్య విహారం చేస్తున్నాయి. గ్రామస్తులు నిత్యం ఆసుపత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. ముఖ్యంగా నెల రోజులుగా డెంగ్యూ, చికున్‌గున్యా వ్యాధులు గ్రామంలో తిష్ట వేశాయి. వ్యాధి బారిన పడి కోలుకున్న వారు మోకాళ్ళు, కీళ్ళ నొప్పులతో బాధపడతున్నారు. ఒకరు కోలుకున్నాక మరొకరికి వ్యాధి సోకుతుండడంతో గ్రామంలో సుమారు 500 మంది వరకూ డెంగ్యూ, గన్యా బారినపడ్డట్లు సమాచారం. వీటి వ్యాప్తిని అరికట్టేందుకు వైద్య శాఖాధికారులు తీసుకున్న చర్యలు నామమాత్రం కావడంతో ఇంకా అదుపులోకి రాని పరిస్థితి. దీంతో జ్వర పీడితులు ప్రయివేట్ ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ వేలకు వేలు చేతి చమురు వదిలించుకుంటున్న పరిస్థితి నెలకొంది.



జ్వరపీడితులతో మాట్లాడుతున్న గంధం మణి

నెల రోజులుగా తిష్ట

చియ్యవరం గ్రామంలో అరుంధతి వాడను కలుపుకుని సుమారు 500 కుటుంబాల వారు నివాసం ఉంటున్నారు. మేజర్ పంచాయితీల్లో చియ్యవరం ఒకటి. అయితే వరుస తుపాన్ల తాకిడితో కురిసిన భారీ వర్షాలకు గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. దోమలు విపరీతంగా వద్ధి చెందాయి. గత డిసెంబర్ నెల నుంచి గ్రామంలో డెంగ్యూ, చికెన్ గన్యా లాంటి వ్యాధులు ప్రబలడంతో ఇంటికో రోగి మంచాన పడ్డారు. విపరీతమైన జ్వరం, నీరసించి పోవడం, చిగుళ్ళు, నోటి నుంచి రక్తం కారడం, నడవలేనంతగా మోకాళ్లు, కీళ్ల నొప్పులు లాంటి లక్షణాలు ఇబ్బంది పెట్టడంతో ప్రజలు కాసరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పరుగులు పెట్టారు. అక్కడ అంతంత మాత్రమే వైద్యం అందడంతో చేసేదిలేక ప్రైవేటు ఆసుపత్రులకు బారులు తీరాల్సి వచ్చింది. చియ్యవరంలో నెల రోజులకు పైగా డెంగ్యూ, చికెన్ గన్యా లాంటి వ్యాధులు ప్రజలను అల్లాడిస్తున్నా వైద్యాధికారులకు కనీసం చీమకుట్టినట్టు ఉండని పరిస్థితి. ఏదో ఒక్కసారి చుట్టపు చూపుగా గ్రామాన్ని సందర్శించి వెళ్లారే తప్పా, వ్యాధుల నివారణకు చేపట్టిన చర్యలు మాత్రం మిథ్యేనని చెప్పాలి. డెంగ్యూ వ్యాధిని అంచనా వేయక గ్రామానికి చెందిన శివయ్య నాయుడు, చలపతి నాయుడు, గుర్రప్పతో పాటు మరో ఇద్దరు గడిచిన నెల రోజుల్లో ప్రాణాలు కోల్పోయినట్లు గ్రామస్తులు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి వైద్య సహకారం అందకపోవడంతో ప్రైవేట్ ఆస్పత్రులకు రూ. 50వేల నుంచి రూ. 70 వేల వరకు ఖర్చు చేసినట్లు బాధితులు వాపోతున్నారు. గ్రామంలో ఇప్పటికీ 20 మందికి పైగానే జ్వర పీడుతులున్నట్లు చెబుతున్నారు. ఈ విషయంపై వైద్యాధికారిని వివరణ అడిగే ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు.

మెరుగైన వైద్యం అందించాలి: సీపీఎం

చియ్యవరం గ్రామంలో జ్వరాలతో అల్లాడుతున్న బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నాయకులు చియ్యవరంలో పర్యటించారు. జ్వర పీడితులను పరామర్శించారు. వైద్యులు, పంచాయతీ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే చియ్యవరంలో వ్యాధులు ప్రబలినట్లు ఏరియా కార్యదర్శి గంధం మణి ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో వెంటనే వైద్య శిబిరం నిర్వహించాలన్నారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు. పెనగడం గురవయ్య, కుమార్, గురునాథం తదితరులుపాల్గొన్నారు.


కందులవారిపల్లి ఘటన దురదృష్టకరం : డిఎఫ్ఓ

ఎలిఫెంట్ ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లు ఏర్పాటు



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తిరుపతి జిల్లా పరిధిలో గ్రామాల వెంట వచ్చే ఏనుగుల కట్టడికి ఆ గ్రామాల పరిధిలో ఉన్న గ్రామస్తుల సహకారం తప్పనిసరి అని, కందుల వారి పల్లి దుర్ఘటన దురదష్టకరమని జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్ అన్నారు. సోమవారం కపిలతీర్థం వద్దగల అటవీశాఖ డివిజన్ కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎఫ్ఓ వివేక్ మాట్లాడుతూ ఏనుగు అసాధారణ జంతువు అని, అవి పల్లె ప్రాంతాలలో ఉన్న పంటలపై దాడులను నిర్మూలించడానికి ఏనుగుల గుంపును జనావాసాల నుండి అటవీ ప్రాంతంలోకి మళ్లింపు చేయడానికి నూతనంగా ఎలిఫెంట్ రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో రాపిడ్ రెస్పాన్స్ టీం లో పదిమంది ఉంటారని, ఇప్పటికే మూడు టీంలు ఏర్పాటు చేశామన్నారు. ఈ రాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ సబ్ డివిజనల్ ఫారెస్ట్ ఆఫీసర్ పర్యవేక్షణలో పనిచేస్తాయన్నారు. డ్రోన్ల సహాయంతో ఏనుగుల గుంపు అడవిలో కదిలే గమనాలను ఎప్పటికప్పుడు గుర్తించి గ్రామపంచాయతీ, అగ్రికల్చర్ అసిస్టెంట్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్, అటవీ శాఖకు చెందిన ప్రభుత్వ విభాగాల అధికారులతో ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూప్ ను క్రియేట్ చేసామన్నారు. ఈ గ్రూపులో ఏనుగుల గుంపు గమనాన్ని పోస్ట్ చేసి ఆయా పరిధిలోని గ్రామాల ప్రజలు అప్రమత్తం అయ్యేలా చర్యలు తీసుకున్నామన్నారు. కేరళ రాష్ట్రంలో ఏనుగుల గుంపు పంటను నష్టపరిస్తే అక్కడ రాష్ట్ర, జాతీయ విపత్తుగా పరిగణించే విధంగా ఆ రాష్ట్రం ప్రత్యేక జీవోను తీసుకువచ్చిందని, దీని ద్వారా పంట నష్టపోయిన రైతుకు వ్యవసాయ శాఖ నుండి, హార్టికల్చర్ నుండి కూడా తగిన నష్టపరిహారం అందుతుంది అన్నారు. ఈ విధమైన విధానాన్ని తీసుకురావడానికి ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. ఇవే కాకుండా అటవీ సరిహద్దు గ్రామాల పరిధిలో ప్రచార జాతాలు, టోల్ ఫ్రీ నెంబర్ను ఏర్పాటు చేసే ప్రక్రియను పరిశీలిస్తున్నామన్నారు. ఏనుగులు గుంపు గ్రామాల వెంబడి ఉంటే ఆయా గ్రామాల ప్రజలు వాటిని అడవిలోకి పంపడానికి టపాకాయలు కాల్చడం, పెద్ద శబ్దాలు చేయడం వాటికి కోపాన్ని తెప్పిస్తాయని, గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.



వినతిపత్రం ఇస్తున్న రైతుసంఘాల నాయకులు

దల్లే వాల్ ప్రాణాల్ని కాపాడాలి

ఎంపికి రైతుసంఘాల వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

రైతుకు మద్దతు ధర ప్రకటించాలని, గత 57 రోజులుగా ఆమరణ నిరాహారదీక్ష చేస్తున్న రైతునాయకుడు జగ్జిత్‌సింగ్ దల్లెవాల్ ప్రాణాల్ని కాపాడాలని డిమాండ్ చేస్తూ సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు మేరకు తిరుపతి ఎంపి గురుమూర్తికి రైతుసంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జిల్లా నాయకులు పాటూరి వెంకటరత్నం, జిల్లా అధ్యక్షులు రామిశెట్టి వెంకయ్య, కాంగ్రెస్ పార్టీ రైతు నాయకులు మాంగాటి గోపాల్ రెడ్డి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి హేమలత, సిపిఐ రైతు సంఘం తరపున చలపతి, పద్మనాభ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంయుక్త కిసాన్ మోర్చా నాయకులతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, కేంద్ర మంత్రులు చర్చించి రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పంజాబ్ సరిహద్దుల్లో రైతు ఉద్యమంపై నిర్బంధాన్ని ఆపాలన్నారు. పంటలకు కనీస మద్దతు ధర చట్టం చేయాలని వ్యవసాయ మార్కెట్లను కబళించే నేషనల్ ఫ్రేమ్ వర్కు పాలసీని వెనక్కి తీసుకోవాలని, రైతు వ్యతిరేక కార్పొరేట్ అనుకూల డిజిటల్ అగ్రిమిషన్ విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలి: కలెక్టర్


పిజిఆర్ఎస్‌కు 185 అర్జీలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుండి క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారానికి నోచుకోకపోవడంతో జిల్లా కేంద్రానికి వస్తున్నారని, ఇక్కడికి వచ్చే ప్రతి అర్జీదారుడికి సావధాన పరిష్కారం చూపాలని జిల్లా అధికారులను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్లో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి కలెక్టర్ వెంకటేశ్వర్, డిఆర్ఓ నరసింహులు, డిప్యూటీ కలెక్టర్ రోజా రాణి ఇతర విభాగాల అధికారులు అర్జీలు స్వీకరించారు. సోమవారం నిర్వహించిన పిజిఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి 185 అర్జీలు వచ్చాయి. అందులో సింహభాగం రెవెన్యూ శాఖకు సంబంధించి 122 అర్జీలు వచ్చాయి.

స్లాబ్ నిర్మాణానికి ఆర్థిక సాయం చేయండి

బివి నరసింహారావు, కుర్రకాల్వ



రేణిగుంట మండలం కుర్రకాల్వ పద్మ నగర్లో 2018లో హౌసింగ్ ద్వారా స్థల మంజూరు జరిగింది. కొంత అప్పులు చేసి రెండు స్టేజీల వరకూ ఇంటి నిర్మాణం చేశాను. ఇంటి పైకప్పు నిర్మించుకోవడానికి ఆర్థిక సాయం చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా. వికలాంగుడైన నేను ఇంటి పైకప్పు నిర్మాణం చేసుకోలేకపోతున్నాను. రూ.6 వేల రూపాయలు వికలాంగ పింఛన్ మాత్రమే నా ఆదాయం. ఐదేళ్లుగా ప్రభుత్వ కార్యాలయాలు చుట్టూ తిరుగుతున్నాను. ప్రభుత్వం నాపై దయవుంచి స్లాబ్ నిర్మాణం చేసుకోవడానికి ఆర్థిక సాయం చేయాలి.

'గిరిజన భవన్'ను అభివృద్ధి చేయాలి

శివశంకర్‌నాయక్, గిరిజన నవ సమాజ వ్యవస్థాపకులు



గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం 2018లో కోటి 35 లక్షల నిర్మాణ వ్యయంతో గిరిజన భవన్‌ను నిర్మించారు. అయితే భవన్ లో అవసరమైన మౌలిక వసతులు లేకపోవడం వలన అనాదరణ పొందుతోంది. గిరిజనులు వారి కుటుంబ కార్యక్రమాలను, పేదలు పెళ్లిళ్లు చేసుకోవడానికి, వివిధ కార్యక్రమాలను నిర్వహించుకోవడానికి వేసులుబాటు ఉన్నా వసతుల లేమి కారణంగా ఎవరు గిరిజన భవన్ ను ఉపయోగించుకోలేకపోతున్నారు. పైగా వర్షం వస్తే నీరు ఎటూ పోకుండా భవన్ ప్రహరీ ప్రాంగణంలోనే ఉండిపోతుంది. భవన్ అభివద్ధికి చేయూతనందించాలి. స్పందించిన కలెక్టర్ వెంటనే గిరిజన సంక్షేమ అధికారిని పిలిపించి వసతుల కల్పనకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు.

మా స్థలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించారు

కృష్ణంరాజు, భూబాధితుడు, తిరుమల




శ్రీకాళహస్తి మండల పరిధిలోని పానగల్ గ్రామ లెక్క దాఖలా సర్వేనెంబర్ 66/3 లో 50 సెంట్లు స్థలాన్ని అద్దాల మిట్ట రామ్ ప్యారి స్వామి నుండి మేము 1995లో 1411 డాక్యుమెంట్ ద్వారా కొనుగోలు చేశాము. దీన్ని 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు సామాను శ్రీధర్ రెడ్డి అనే వ్యక్తి దౌర్జన్యంగా ఆక్రమించి తన ఆధీనంలో ఉంచుకున్నాడు. చుట్టూ తన భూమిని చూపుతూ మా భూమిని కూడా కలుపుకోవాలని ప్రయత్నం చేస్తున్నారు. మా భూమిని ఆక్రమితదారు నుండి రక్షించి అప్పగించాలని కోరుతున్నాను.

పట్టా ఇచ్చారు.. భూమి చూపలేదు..

గాంధీ, నక్కల కాలనీ, తిరుచానూరు



గత ప్రభుత్వ హయాంలో నక్కల కాలనీలో నివాసం ఉంటున్న మాకు జగనన్న ఇంటి స్థలాలు మంజూరు చేశారు. 2020లో మాకు కేటాయించిన ఒకటిన్నర సెంటు భూమికి సంబంధించి రిజిస్ట్రేషన్ జరిగింది. అయితే సుదూరంగా భూమి కేటాయించడంతో ఆ ప్రదేశం కాకుండా వేరొక ప్రదేశంలో భూమి చూపాలని గత ఆరు నెలలుగా అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాము. ఎప్పుడు వచ్చినా అధికారులు అదిగో ఇదిగో అంటున్నారే గాని పరిష్కారం చూపలేదు.



కమిషనర్‌కు అభినందనలు తెలియజేస్తున్న సిపిఎం నేతలు

కమిషనర్‌కు సిపిఎం అభినందనలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ప్రజల నుండి వచ్చే వినతులు, సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని పున్ణప్రారంభించడంతో సిపిఎం నగర కార్యదర్శి కె.వేణుగోపాల్ అభినందనలు తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ఫోన్ ద్వారా 10 మంది, మరో 40 మంది వినతులు ద్వారా సమస్యలను విన్నవించారని కమిషనర్ తెలిపారు. ఇందులో ముఖ్యంగా ఆకుతోట వీధిలో మురుగు కాలువలు శుభ్రం చేయాలని, టి.డి.ఆర్. బాండ్లు ఇప్పించాలని, కోటకొమ్మల వీధిలో సెట్ బాక్ లేకుండా నిర్మాణాలు చేస్తున్నారని, ఉపాద్యాయ నగర్ లో కుక్కల సమస్య పరిష్కరించాలని, భవాని నగర్ లో యుడిఎస్ సమస్య పరిష్కరించాలని, సాయి విష్ణు లే ఔట్ నందు కాలువలు నిర్మించాలని, రవీంద్ర నగర్ నందు రోడ్లు, మురుగునీటి కాలువలు ఏర్పాటు చేయాలని, పారిశుద్ధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని ప్రజలు వినతులు సమర్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

'స్మార్ట్‌సిటీ' పనులు పరిశీలన

స్మార్ట్ సిటీ నిధులతో తిరుపతి నగరంలో చేస్తున్న అభివద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్, మేనేజింగ్ డైరెక్టర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. నగరంలో స్మార్ట్ సిటీ నిధులతో జరుగుతున్న సిటీ ఆపరేషన్ సెంటర్(నగరపాలక సంస్థ కార్యాలయం), మల్టి లెవల్ కార్ పార్కింగ్, శ్రీనివాస సేతు లో పెండింగ్లో ఉన్న సుందరీకరణ, మురుగునీటి కాలువలు, వినాయక సాగర్ వద్ద పెండింగ్ లో ఉన్న కూరగాయల మార్కెట్, స్విమ్మింగ్ పూల్ పనులను ఇంజినీరింగ్, స్మార్ట్ సిటీ అధికారులతో కలసి సోమవారం ఉదయం కమిషనర్ పరిశీలించారు. కొర్లగుంట వద్ద మురుగునీటి కాలువ నిర్మాణంపై ఎక్కువ ఫిర్యాదులు వస్తున్నాయని త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, స్మార్ట్ సిటీ ఈ.ఈ. చంద్రశేఖర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.లు రాజు, మధు, రమణ, లలిత, వెంకట ప్రసాద్, ఏ.సి.పి. బాలాజి, ఏఈకాం ప్రతినిధి బాలాజి, శానిటరీ సూపర్ వైజర్ సుమతి ఉన్నారు.

ఫాగ్సీచే 'ఆరోగ్య యోగ యాత్ర'

ప్రజాశక్తి -తిరుపతి సిటీ



సుమారు 46వేల మందికి పైగా ప్రసూతి, గైనకాలజీ నిపుణులకు ప్రాతినిధ్యం వహిస్తున్న, భారతదేశంలోని అతిపెద్ద ప్రొఫెషనల్ సంస్థ ఫెడరేషన్ ఆఫ్ అబ్స్టెట్రిక్ అండ్ గైనకాలజికల్ సొసైటీస్ ఆఫ్ ఇండియా (ఫాగ్సి), యునిసెఫ్ సహకారంతో భారతదేశంలోని తల్లులు, శిశువుల సమగ్ర సంక్షేమంపై ఒక సంచలనాత్మక కార్యక్రమం అయిన 'ఆరోగ్య యోగ యాత్ర'ను ప్రారంభించారు. ఈ సందర్భంగా తిరుపతిలోని ఓ ప్రైవేటు హోటల్లో ఫాగ్సి అధ్యక్షురాలు డాక్టర్ సునీతా తందూల్వాడ్కర్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఆధ్యాత్మిక కేంద్రమైన తిరుపతిలో ప్రారంభించిన ఈ యాత్ర 13 ఆధ్యాత్మిక ప్రసిద్ధి ప్రదేశాలలో ఏడాది పొడవునా జరుగుతుందన్నారు. ఈ జాతీయ కార్యక్రమం, ఆధ్యాత్మికతను వైద్యంలో అనుసంధానించడం , మహిళలు, వైద్యులలో ఆరోగ్యం పట్ల చురుకైన విధానాన్ని ప్రేరేపించడం లక్ష్యంగా పెట్టుకుందని పేర్కొన్నారు. ఈ ప్రత్యేకమైన కార్యక్రమం భారతదేశ ఆధ్యాత్మిక వారసత్వాన్ని ఆధునిక వైద్యంతో మిళితం చేసి, మహిళలను శక్తివంతం చేయటం ద్వారా , దేశంలో ఆరోగ్య సంరక్షణ సేవలను మార్పు చేయవచ్చు అన్నారు. యునిసెఫ్ ఇండియా ఆరోగ్య నిపుణుడు డాక్టర్ సయ్యద్ హుబ్బే అలీ మాట్లాడుతూ గర్భిణీ స్త్రీల మానసిక ఆరోగ్యం అత్యంత క్లిష్టమైనదని, తరచు నిర్లక్ష్యం చేయబడిన సమస్యగా నిలుస్తుందన్నారు. భారతదేశంలో గర్భధారణ సంబంధిత ఒత్తిడి 40శాతం మంది మహిళలను, నిరాశ 20శాతం మందిని, ఆందోళన 33శాతం మందిని ప్రభావితం చేస్తుందన్నారు. ఈ ప్రచారం ద్వారా, యునిసెఫ్, ఫాగ్సి దేశవ్యాప్తంగా వైద్య సమాజంలో తల్లి మానసిక ఆరోగ్యాన్ని ఏకీకతం చేయడానికి కట్టుబడి ఉన్నాయన్నారు. అనంతరం ఎస్విఎంసి అసోసియేషన్ భవనంలో జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి వైద్య రంగం లోని ప్రముఖులు నిపుణులు హాజరయ్యారు. వీరితో పాటుగా తిరుపతి ఎమ్మెల్యే డాక్టర్ అరణి శ్రీనివాసులు, ఎంఎల్సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, తిరుపతి మేయర్ డాక్టర్ ఆర్ శిరీష హాజరయ్యారు. ఈ కార్యక్రమంను అమలు చేయడానికి ఈ ప్రాజెక్టుకు జాతీయ కన్వీనర్లుగా పనిచేస్తున్న ఫాగ్సి సీనియర్ ఫాగ్సియన్ డాక్టర్ జయం కన్నన్, ఫాగ్సి జాయింట్ సెక్రటరీ డాక్టర్ అశ్విని కాలే, ఫాగ్సి వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ పళనియప్పన్, డాక్టర్ పార్థసారథి రెడ్డి, డాక్టర్ రాయపు రమేష్, డాక్టర్ మనోహర్ పాల్గొన్నారు.

టిటిడిలో తప్పలను సర్దుకుపోవాలి : చింతామోహన్

తిరుపతి సిటి : స్విమ్స్‌లో రోగులు, టిటిడి అర్చకులు, టిటిడి శాశ్వత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టిటిడి పరిపాలనా భవనం వద్ద సోమవారం నిరసన తెలిపారు. కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ మాట్లాడుతూ టిటిడివంటి గొప్ప ధార్మిక సంస్థలో వేలాదిమంది ఉద్యోగులు శ్రద్ధగా పనిచేస్తున్నారని, చిన్నచిన్న పొరబాట్లు జరుగుతుంటాయని, విశాల హృదయంతో సర్దుకుపోవాల్సిన అవసరం ఉందన్నారు. గుండెజబ్బుల ఆస్పత్రిని ప్రారంభించాలన్నారు. తిరుపతిలో క్యాన్సర్ ఆస్పత్రిని ప్రభుత్వం ఆద్వర్యంలో ఏర్పాటు చేయాలన్నారు. అలిపిరి నుంచి పేరూరు వరకూ 400 ఎకరాల టిటిడి భూములు ఉన్నాయని, టిటిడి శాశ్వత ఉద్యోగులకు, వర్కింగ్ జర్నలిస్టులకు ఐదేసి సెంట్లు ఇంటి స్థలానికి కేటాయించాలన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యార్లపల్లి గోపి గౌడ్, రవి, తేజోవతి, ముని శోభ, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీలను ప్రభుత్వం ఆదుకోవాలి


సమావేశంలో పాల్గొన్న హమాలీలు

ప్రజాశక్తి -నారాయణవనం: మండలంలోని హమాలీలను ప్రభుత్వం ఆదుకోవాలని ప్రాంతీయ హమాలీ కమిటీ నాయకులు ఎస్ నాగరాజు కోరారు. నారాయణవనం మండల హమాలీల కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ కమిటీ నాయకులు ఎస్ నాగరాజు, ముఠా కార్మికులు ప్రమాదం బారిన పడిన హమాలీలను ప్రభుత్వం ఆదుకోవాలని వారికి ఒక గుర్తింపు కార్డులు ఇవ్వాలని పని ప్రదేశాలలో కార్మికులకు అన్ని సదుపాయాలు కల్పించాలని, ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మికులను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నారాయణవనం మండలం సిపిఎం నాయకులు ఆర్ మునిశంకర్, సంపత్, సుబ్రహ్మణ్యం, వెంకటేశులు పాల్గొన్నారు.

పక్షుల పండుగలో బిఎన్ కండ్రిగ విద్యార్థులు


డిఇవోతో కలిసి పక్షుల పండుగలో పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: ఫ్లెమింగో ఫెస్టివల్లో భాగంగా పక్షులు విడిది కేంద్రం నేలపట్టును మండలంలోని బుచ్చినాయుడు కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కల్లివెట్టు ఉన్నత పాఠశాల విద్యార్థులు డిఇఓ కుమార్తో కలిసి సందర్శించారు. వేల మైళ్ల దూరం నుంచి సంతా నోత్పత్తి కోసం నేలపట్టు చెరువుకి వచ్చి సంతానాన్ని వృద్ధి చేసుకుని తిరిగి వెళ్లడం సంప్రదాయంగా వుంది. దీన్ని రాష్ట్ర ప్రభుత్వ పండుగగా చేసి సందర్శనార్థం సౌకర్యాలు ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా పాఠశాల విద్యార్థులకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడంతో సందర్శించారు. ఈ సందర్భంగా డిఇఓ పిల్లలతో ముచ్చటించి పక్షుల విడిది ప్రాధాన్యతను, పక్షుల రకాలను తెలుసుకోవాలని విద్యార్థు లకు సూచించారు. ఈ సందర్శనలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె రమణయ్య, రూపేష్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గూడూరు డిఎస్పి బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు స్వీకరిస్తున్న డిఎస్పి గీతాకుమారి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు డీఎస్పీగా గా గీతా కుమారి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ గూడూరు సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణకు కృషి చేస్తామన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ పై ప్రత్యేక చర్యలు తీసుకుం టామన్నారు. ఈమె గతంలో ఎక్సైజ్ సిఐగా, తహశీల్దారుగా పని చేశారు. గ్రూప్ -1 ఉత్తీర్ణత సాధించి, తొలి పోస్టింగ్ డిఎస్పీగా గూడూరుకు వచ్చారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని సిఐలు, ఎస్ఐ లు , పాల్గొన్నారు.

ఉపాధి పనుల సామాజిక తనిఖీ

ప్రజాశక్తి -ఏర్పేడు: మండలంలోని 40 గ్రామ పంచాయతీలకు 2023- 24 ఆర్థిక సంవత్సరంలో చేసిన ఆర్డబ్ల్యూఎస్, పిఆర్ఏఐ, ఎంఎన్ఆర్జిఇఎస్ పనులపై సామాజికి తనిఖీ బృందం సోమవారం సామాజిక తనిఖీ నిర్వహించింది. సామాజిక తనిఖీ బృందం 15 రోజులు పాటు నిర్వహించనున్న సోషల్ ఆడిట్లో భాగంగా మండలంలో ఆర్డబ్ల్యూఎస్, పిఆర్ఏఐ, ఎంఎన్ఆర్జిఇఎస్ పనుల తీరును అధికారులు పరిశీలించారు. రూ. 10 కోట్ల 40 లక్షల ఇరవై రెండు వేల373 (వేజ్ ఎనిమిది కోట్ల 54 లక్షల 64 వేల 276, మెటీరియల్ కోటి 85 లక్షల 58 వేల 97 రూపాయలు) వెచ్చించిన పనులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తామని ఎస్ఆర్పి వెంకయ్య ఈ సందర్భంగా తెలిపారు.

జేఈఈ ఎగ్జామ్స్ సెంటర్ పరిశీలన

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని విద్యానగర్ లోని ఎన్ బి కే ఆర్ఐ ఎస్టీ లో ఈ నెల 22 వ తేదీ నుండి 30 తేదీ వరకు జేఈఈ మెయిన్స్ ఎగ్జామ్స్ నిర్వహిస్తున్న కారణంగా కోట మండల తహశీల్దారు కటారి జయ జయ రావు రెవెన్యూ సిబ్బంది తో కలిసి ఎన్ బి కే ఆర్ ఐ ఎస్టీ క్యాంపస్ లోని కంప్యూటర్ ల్యాబ్ను సోమవారం క్షుణ్ణంగా పరిశీలించారు. తహశీల్దారుతో పాటు మండల సర్వేయర్ గోపిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి నేతకు ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - పిచ్చాటూరు: పిచ్చాటూరు మండలం అడవి కోడియంబేడుకు చెందిన టిడిపి నేత ఎస్ శంకర్ అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సోమవారం మధ్యాహ్నం మృతుని స్వగ్రామం అడవి కోడియంబేడు కు చేరుకొని శంకర్ భౌతికకాయానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, శంకర్ కుటుంబానికి టిడిపి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బుజి నాయుడు, రవి, ఢిల్లీ, కరివర్ధన్ కార్యకర్తలు పాల్గొన్నారు.

భార్యాభర్తలు మృతి

రేణిగుంట-కడప హైవేపై ప్రమాదం

ప్రజాశక్తి - రేణిగుంట

తెలంగాణకు చెందిన భార్యాభర్తలు శ్రీవారి దర్శనం కోసం వచ్చి తిరిగి వెళుతుండగా రేణిగుంట మండలం సమీపంలోని కుక్కల దొడ్డి గ్రామం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కుక్కల దొడ్డి రాళ్లవాగు దగ్గర కోతులు గుంపులుగా రావడంతో ఈ ప్రమాదానికి కారణమని రేణిగుంట పోలీసులు పేర్కొన్నారు. రేణిగుంట -కడప ప్రధాన రహదారిలోని కుక్కల దొడ్డి వద్ద రోడ్డు ప్రమాదం జరిగిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో హైదరాబాద్లోని పటాన్ చెరువుకు చెందిన భార్యా భర్తలు సందీప్ (45), అంజలీదేవి(40) తిరుమల శ్రీవారిని దర్శించుకుని హైదరాబాద్కు తిరిగి వెళ్తుండగా కుక్కలదొడ్డివద్ద ఘోర ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో వారు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు.. ఈనెల 16వ తేదీ తిరుమల దర్శనానికి సంగారెడ్డి జిల్లా పటాన్ చెరువు చెందిన సందీప్ భార్య అంజలీదేవితో పాటు ఇద్దరు పిల్లలతో శ్రీవారి దర్శనం చేసుకుని సోమవారం ఉదయం 11:30 గంటలకు రేణిగుంట- రైల్వే కోడూరు రోడ్డు నందు, కుక్కల దొడ్డి గ్రామ సమీపంలో, రాళ్ల వాగుకు సుమారు 200 మీటర్ల దూరంలో వెళుతూ ఉండగా ఆ సమయంలో రోడ్డుపైకి ఒక్కసారిగా కోతులు మూక రావడం వలన డ్రైవింగ్ చేస్తున్న సందీప్ వాటిని తప్పించబోయి స్టీరింగ్ పై అదుపుతప్పి కోడూరు వైపు నుంచి తిరుపతి వస్తున్న ట్రావెల్ బస్సును ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో కారు డ్రైవింగ్ చేస్తున్న సందీప్, అతని భార్య అంజలీదేవి కి బలమైన రక్తగాయాలయ్యాయి. వీరు అక్కడికక్కడే మృతి చెందారు. పిల్లలకు గాయాలవడంతో 108లో దగ్గరలోని అమర ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు.


ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన వాహనం

క్రైం న్యూస్

నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి - పిచ్చాటూరు: మండలంలోని ఓ వ్యక్తిపై పెట్రోలు పోసి నిప్పంటించిన కేసులో నిందితుడిని సోమవారం అరెస్టు చేసినట్లు పిచ్చాటూరు పోలీసులు తెలిపారు. పిచ్చాటూరు ఎస్ఐ సి వెంకటేష్ కథనం మేరకు..ఈ నెల 17వ తేదీ మండలంలోని అడవి కోడియంబేడు దళితవాడకు చెందిన వెట్టి మనోహర్ (68)పై అదే దళితవాడకు చెందిన చిన్నతంబి పెట్రోలు పోసి నిప్పంటించిన దాడికి పాల్పడ్డ కేసుకు సంబంధించి నిందితుడిని సోమవారం అరెస్టు చేశామని తెలిపారు. పిచ్చాటూరు మండలంలోని అడవి కోడియంబేడు దళితవాడలో ఈ నెల 17వ తేదీ ఉదయం 10 గంటలకు, అదే దళితవాడకు చెందిన చిన్న తంబి పాత కక్షలతో తన చిల్లర అంగడికి సరుకులు కొనుగోలుకు వచ్చిన అదే దళితవాడకు చెందిన వెట్టి మనోహర్ (68)పై తన అంగడిలో ప్లాస్టిక్ బాటిల్లో నింపి వున్న పెట్రోలును మనోహర్పై పోసి నిప్పంటించాడని, మనోహర్ మంటలను భరించ లేక గట్టిగా కేకలు వెయ్యగా, చుట్టుపక్కల వారు వచ్చి మనోహర్పై నీళ్ల పోసి మంటలు ఆర్పారని తెలిపారు. మనోహర్ను అతని బంధువులు వెంటనే నగరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారని, ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడని తెలిపారు. కేసును దర్యాప్తు చేస్తుండగా పరారీలో వున్న నిందితుడు చిన్న తంబిని పిచ్చాటూరు ఎస్-ఎస్బి పేట చెక్ పోస్ట్ వద్ద ఈ నెల 19వ తేదీ అరెస్టు చేసి సత్యవేడు జెఎఫ్సిఎం కోర్టులో హాజరు రిమాండ్కు తరలించామని తెలిపారు. సంఘటన జరిగిన 24 గంటల్లోపు పరారీలో వున్న నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు పంపిన పోలీసులను పై అధికారులు ప్రశంసించారు.

మొదటి సెమిస్టర్ పరీక్ష ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - క్యాంపస్ : టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర ఆర్ట్స్ కళాశాల (అటానమస్) మొదటి సెమిస్టర్ పరీక్షలు 2024వ సంవత్సరం డిసెంబర్లో 23వ తేదీ నుండి 30వ తేదీ వరకు నిర్వహించారు. ఈ పరీక్షల ఫలితాలను కళాశాల ప్రిన్సిపాల్ యన్. వేణుగోపాల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ పి భాస్కరుడు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ పివి చలపతి ఆధ్వర్యంలో సోమవారం విడుదల చేశారు. ఎక్కువ మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. పరీక్షలు ముగిసిన 20 రోజులకే ఫలితాలను విడుదల చేయడం విశేషం. ఫలితాల ప్రకటన సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానాల ఇన్ఛార్జి విద్యాశాఖాధికారి జి విజయలక్ష్మి ఆనందం వ్యక్తం చేస్తూ విద్యార్థుల ప్రగతిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ కంట్రోలర్స్ కె కామేశ్వరరావు, వి రమేష్, సిఇ సెల్ సభ్యులు చక్రవర్తి, సురేంద్ర, శేషాద్రి, నాగరాజు, వివిధ విభాగాల హెచ్ఓడీలు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో 11 మంది ఎంపిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం సీడెప్, డి ఆర్డిఏ సంయుక్తంగా నిర్వహించిన జాబ్ మేళాకి విశేష స్పందన లభించిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి తెలిపారు. ఈ జాబ్ మేళాలో టేక్ మహేంద్ర, క్వస్ ప్రయివేట్ లిమిటెడ్ (డిక్సన్), అపోలో ఫార్మసి వారు పాల్గొన్నారు. కాగా ఈ జాబ్ మేళాలో 94 మంది పాల్గొనగా 11 మంది విద్యార్థులు పలు ఉద్యోగాలకు. ఎంపికయ్యారన్నారు. ఈ జాబ్ మేళాలో ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్ర మౌళి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వీరయ్య, డాక్టర్ కోటేశ్వరయ్య, ఎస్పిడిసి టి . నరసింహులు, ఏపి ఎస్ఎస్డిసి జిల్లా ప్లేస్ మెంట్ అధికారి చైతన్య, కళాశాల స్కిల్ హబ్ కోఆర్డినేటర్ రసూల్ పాల్గొన్నారు.

సత్తా చాటిన మంగళం బిసిఎం విద్యార్థులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

వరుస విజయాలతో తమ సత్తా చాటుతూ పథకాలను పొందుతున్న బాలచంద్ర మెమోరియల్ హై స్కూల్ విద్యార్థులు ఇండో - నేపాల్ జంప్ రూప్ ఛాంపియన్షిప్లోనూ ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయాన్ని సొంతం చేసుకున్నారని పాఠశాల కరస్పాండెంట్ ప్రియా తెలిపారు. జనవరి 7, 8 తేదీల్లో నేపాల్ లో ఉన్న పోఖారా స్టేడియం వేదికగా ఇండోబినేపాల్ జంప్ రోప్ ఛాంపియన్ షిప్ను నిర్వహించారన్నారు. ఈ పోటీల్లో బాలచంద్ర మెమోరియల్ హై స్కూల్ విద్యార్థి అండర్-19 ఫ్రీ స్టైల్ విభాగంలో కె.లాస్య బంగారు పతకం సాధించిందన్నారు. అండర్ -14 ఎల్ఆర్ఎస్ విభాగంలో వి.వేదశ్రీ , యం.దినేష్ , టి.అర్.మోనీష్ బంగారు పతకాలను సాధించారన్నారు. అండర్ -14లో 3 నిమిషాలు ఎండురెన్స్ విభాగంలో ఆర్.హరిప్రియ బంగారు పతకం సాధించిందన్నారు. అభినందన కార్యక్రమంలో పాఠశాల వ్యవస్థాపకులు కష్ణమూర్తి నాయుడు, పాఠశాల ప్రిన్సిపల్ సుకన్య పాల్గొన్నారు.


జాతీయ జెండాను చూపుతున్న జంప్ రోప్ ఛాంపియన్షిప్ విజేతలు

సాధనతో ఘన విజయం: భావన రెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ప్రతి ఒక్కరికీ జీవితంలో లక్ష్యం ఉండాలని, లక్ష్యసాధన దిశగా తగిన సాధన చేయగలిగితే ఘన విజయాన్ని సొంతం చేసుకోవచ్చని మిస్ గ్లోబల్ ఏషియా విజేత చిన్నతంబు భావన రెడ్డి అన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఇటీవల మలేషియా దేశం రాజధాని కౌలాలంపూర్ లో నిర్వహించిన మిస్ గ్లోబల్ ఏషియన్-2025 లో తాను విజేతగా నిలిచి తెలుగు వారి ఖ్యాతిని అంతర్జాతీయ వేదికపై నిలపడం సంతోషంగా ఉందన్నారు. 2023లో మిస్ ఇండియా ఐకానిక్ దివా సీజన్ 3 విజేతగా నిలిచారన్నారు. తన లక్ష్యానికి తల్లిదండ్రులు ఇస్తున్న ప్రోత్సాహాకాన్ని, గురువులు ఇస్తున్న సూచనలను మరువలేనన్నారు. ఈ గౌరవంతో సామాజిక శ్రేయస్సు కోసం సేవా కార్యక్రమాలను చేయాలని లక్ష్యాన్ని నిర్ణయించు కున్నానని, ఇందుకోసం మిత్ర ఫౌండేషన్ ను స్థాపించానన్నారు. దీనికోసం త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ను కలవనున్నానన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో తండ్రి గోపికష్ణారెడ్డి, ఇండియా డైరెక్టర్ అర్పిత దేవ్, మోహన్ రెడ్డి, మురళీమోహన్, కోటేశ్వరరావు, రాదేశ్ పాల్గొన్నారు.



ఇంకెన్నాళ్లీ కష్టాలు..

- అండర్ బ్రిడ్జిలో వెళ్లాలంటే ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే
- పట్టించుకునే అధికారులు ఏదీ?

ప్రజాశక్తి - పుత్తూరు, టౌన్: పుత్తూరు మున్సిపాలిటీ పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ ఎదురుగా ఎంబి రోడ్డు వద్ద అండర్ బ్రిడ్జ్ ద్వారా స్కూలుకు వెళ్లే పిల్లలు, కాలేజీకి వెళ్లే విద్యార్థులు, మేస్త్రి పనికి వెళ్లే కూలీలు , మర మగ్గాలు కార్మికులు గేటు పుత్తూరు ప్రజలు, మహిళలు ఈ డ్రైనేజీ మురికి నీళ్లలో నడిచి అటు నుంచి ఇటు దాటు కోవాల్సి వుంది. ఈ గ్రామాల ప్రజలు నరకయాతన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దారి మీదుగానే ప్రయాణం చేయాల్సి వుంది. ఈ డ్రైనేజీ మురికి నీళ్ల ద్వారా ప్రజలు పడుతున్న ఇబ్బందుల్ని గుర్తించి పుత్తూరు మున్సిపాలిటీ కమిషనర్ సంబంధిత అధికారులు వెంటనే ఈ సమస్యకు పరిష్కారం చూపాలని ఎమ్మార్పీఎస్ నగరి నియోజకవర్గ సంఘ నాయకులు , ప్రజా సంఘాలు, పుత్తూరు మున్సిపాల్టీ ప్రజలు కోరుతున్నారు.



బిఎన్ కండ్రిగ క్రికెట్ విజేత సూళ్లూరుపేట జట్టు


క్రికెట్ కప్ను అందుకుంటున్న సూళ్లూరుపేట జట్టు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ సంక్రాంతి పండుగను పురస్క రించుకొని బుచ్చి నాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో బిఎన్కె యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో సూళ్లూరుపేట జట్టు క్రికెట్ టోర్నీ విజేతగా నిలిచింది. ఆ జట్టుకు రూ.20 వేల నగదు, ట్రోఫీ, రన్నర్గా నిలిచిన నీర్పాకోట జట్టుకు రూ.10 వేల నగదును నిర్వాహకులు శాంతకుమార్, సురేష్, తిరుమల, దొరై, అఖిల్ అందిం చారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని అన్ని మండలాల క్రీడాకారులు పాల్గొన్నారు.

ఉల్లాస్తో వెలుగు నింపాలి..

- మహిళలే నిదర్శనం: ఎంపిడివో

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యతను పూర్తిగా నేర్పించి ఉల్లాస్తో వెలుగు నింపాలని, ఇందుకు మహిళలే నిదర్శనమని బుచ్చినాయుడు కండ్రిగ ఎంపిడివో త్రివిక్రమ రావు పేర్కొన్నారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘం అసిస్టెంట్ లకు, వాలంటీర్లకు, టీచర్లకు ఉల్లాస్పై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ త్రివిక్రమ్ మాట్లాడుతూ గ్రామాలలో ఇప్పటికే గుర్తించిన వయోజనులైన నిరక్షరాసులను కుటుంబ సభ్యులుగా భావించి వారికి ఫంక్షనల్ అక్షరాస్యత, ఆర్థిక అక్షరాస్యత, డిజిటల్ అక్షరాస్యతపై పూర్తి స్థాయిలో నేర్పించి ఈ ఉల్లాస్ తో ప్రతి కుటుంబంలో వెలుగు నింపాలని పేర్కొన్నారు. ఈ కార్యమ్రంలో ఎంఇఓ రవీంద్రనాథ్, ఎపిఎం మునెయ్య ప్రసంగించారు. అనంతరం వాలంటీర్ల టీచర్స్కి శిక్షణ మెటీరియల్ అందించారు. ఈ కార్యక్రమంలో ఏపిఓ భానుప్రియ, సీసీలు వెంకటరత్నం, వీరజిన్న, ఎంఎస్ లీడర్లు, విఓఏలు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: మండల కేంద్రమైన పిచ్చాటూరు స్త్రీ శక్తి భవనంలో ఎంపిడివో మహమ్మద్ రఫీ ఆధ్వర్యంలో ఉల్లాస్ వాలంటీర్లకు సోమవారం ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 21 పంచాయతీల్లో 428 మంది అభ్యాసకులను గుర్తించమన్నారు.10 మందికి ఒకరు చొప్పున 43 మంది వాలంటీర్లు ఎంపిక చేసేమన్నారు.15 సంవత్సరాల్లో పై బడిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం వాలంటీర్లకు వయోజన విద్యా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యకమంలో ఏపీఎం రమాదేవి , వెలుగు సిసిలు నాగేంద్ర , సుబ్రహ్మణ్యం , శశికళ , వెలుగు ఆకౌంటెం ట్ హర్షవర్ధిని, వాలంటీర్లు పాల్గొన్నారు.

రామచంద్రపురం: సమాజంలో వయోజనులైన నిరక్షరాస్యులను ఉల్లాస్ కార్యక్రమంతో అక్షరాలు నేర్పి వారిలో అక్షర వెలుగులు నింపాలని ఎంపీడీవో ఇందిర అన్నారు. రామచంద్రా పురం మండలం వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘం సహాయకులకు వాలంటీర్ టీచర్స్ కు ఉల్లాస్ పై శిక్షణ నిర్వహించారు. అనంతరం వాలంటీర్ టీచర్స్ కి శిక్షణ పరికరాలు అందించారు. ఈ కార్యక్రమంలో సీసీ లు సుధాకర్, పార్వతమ్మ, అరుణ ఎం ఎస్ లీడర్లు, వి ఓ ఏ లు పాల్గొన్నారు.

అధికార భాషా కమిటీ కన్వీనర్ తో ఎన్ఎస్యు విసి భేటీ

ప్రజాశక్తి - క్యాంపస్ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయ వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ జియస్ ఆర్ కృష్ణమూర్తి పార్లమెంటరీ అధికార భాషా కమిటీ కన్వీనర్ డాక్టరు దినేష్ శర్మతో సోమవారం సమావేశమయ్యారు. జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జియస్ఆర్ కృష్ణమూర్తి, సబ్-కమిటీ గౌరవ కన్వీనర్ డాక్టరు దినేష్ శర్మతో అధికారికంగా సమావేశమై వివిధ అంశాలపైన చర్చించారు. హోం వ్యవహారాలు, భారతదేశం ప్రభుత్వం, ఉత్తరప్రదేశ్ మాజీ ఉప ముఖ్యమంత్రి శర్మ ప్రభుత్వ శాఖలలో హిందీ వాడకాన్ని ప్రోత్సహించడం ఎలా? అధికారిక కమ్యూనికేషన్లో విస్తృతంగా హిందీ భాష స్వీకరించడాన్ని, ప్రోత్సహించడం వంటి వ్యూహాలపై చర్చలు సాగాయి. ఇకపై హిందీ భాషాభివృద్ధికి దృష్టి సారించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం సంస్కృత భాషతో పాటు వివిధ భాషల అభివృద్ధికి కృషి చేస్తుందని వివరించారు.

టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి -కోట : ఉమ్మడి నెల్లూరు జిల్లా రిటైర్డ్ టీచర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ ను కోట మండల తహశీల్దారు కే.జయ జయ రావు సోమవారం ఆవిష్కరించారు. అనంతరం రిటైర్డ్ ఉద్యోగులు మాట్లాడుతూ రిటైర్డ్ ఉపాధ్యాయులకు 16 లక్షల గ్రాడ్యుటి ఇవ్వాలని, పిఆర్సి బకాయిలు వెంటనే చెల్లించాలని, ప్రతి నెల పెన్షన్లను ఒకటవ తేదీన బ్యాంక్ ఖాతాలో జమ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కందాటి రామిశెట్టి,జిల్లా వైస్ ప్రసిడెంట్ నారాయణ రావు,రిటైర్డ్ హెడ్మాస్టర్ కే.సుబ్బారెడ్డి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ మధులత, తదితర విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కబ్జా భూములు పేదలకు అప్పగించాలి

- నిరూపిస్తే వదిలేసేందుకు సిద్ధం
- టీడీపీ మండల బీసీ సెల్ అధ్యక్షులు చాపల శ్రీనివాసులు

ప్రజాశక్తి -కోట : కేశవరం పంచాయతీలో ఆక్రమించుకున్న భూమలను స్వచ్ఛందంగా వదిలేసి పేదలకు అప్పగించాలని టిడిపి మండల బీసీ సెల్ అధ్యక్షులు చాపల శ్రీనివాసులు పేర్కొన్నారు. సోమవారం కోట మండలంలోని కేశవరం పంచాయతీ, రాఘవాపురం పరిధిలో పలువురు టిడిపి, జనసేన నాయకులతో కలిసి ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ నాయకులు కేశవరం పంచాయతీలోని సర్వే నంబర్ 287-1 లో 5-20 సెంట్లు కలిగిన శ్మశాన భూమిని అక్రమంగా ఆక్రమించుకున్నారని, రాఘవాపురం గ్రామానికి వెళ్లే రోడ్డు సమీపంలో మామిడి తోట వేసి సాగు చేసుకుంటున్నారని అసహనం వ్యక్తం చేశారు. కబ్జా భూములను స్వచ్ఛందంగా వది లేయాలని లేకుంటే ప్రజలందరితో స్నేహంగా ఉండేలా నడుచుకోవాలన్నారు. 'మీరు ఆక్రమించు కోవడమే కాకుండా టీడీపీ నాయకులు కూడా ఆక్రమించుకున్నారు...' అంటూ తమ పై బురద చల్లడం మంచిది కాదన్నారు. ఒకవేళ తాము అక్రమంగా ఆక్రమించుకున్నట్లు అధికారులు నిరూపిస్తే తాము వదిలేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఇప్పటికైనా ప్రజలకు కల్లబొల్లి మాటలు చెప్పడం మాని ప్రజలతో మంచి నడవ డికతో మెలిగేలా చూసుకోవాలన్నారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎక్కువ శాతం భూ సమస్యలు వున్నాయని పలువురు అర్జీ దారులు అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. ఆక్రమిత భూ సమస్యలపై గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్, స్థానిక తహశీల్దారు కే జయ జయరావు దృష్టికి కేశవరం ప్రజలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. కబ్జా భూములను అర్హులైన నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరుతూ గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ఈ భూముల కబ్జా సమస్యను పరిష్కరిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల బీసీ సెల్ అధ్యక్షులు చాపల శ్రీనివాసులు, వరదగొల్ల కోటేశ్వర ప్రసాద్, కసుమూరు వెంకటేశ్వర్లు, చిట్టేటి నాగూరయ్య, కేశవరం సాగునీటి సంఘం అధ్యక్షులు బత్తల బాబు, పసుపులేట వేణు,కోకొల్లు. భూపతి, గజేంద్ర, మల్లి, జనసేన నాయకులు ఏలూరు గురుబాబు, బత్తల శ్రీను, పలువురు పాల్గొన్నారు.


కబ్జా గురైన స్థలంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు చాపల శ్రీనివాస్

రాయలసీమ విద్యార్థుల సదస్సును విజయవంతం చేయండి

ప్రజాశక్తి - క్యాంపస్ : రాయలసీమ కరువు, వలసలు, విద్యా, ఉపాధి రంగ సమస్యలు - కర్తవ్యాలు అనే అంశంపై జరిగే రాయలసీమ విద్యార్థుల సదస్సు పోస్టర్ ను తిరుపతి ఎస్వీయూ ప్రధాన గ్రంథాలయం ఎదుట సోమవారం ఆవిష్కరించారు. తిరుపతి జిల్లా కార్యదర్శి ఆర్. ఆశ మాట్లాడుతూ మనకు స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు కావస్తున్నా, రాయలసీమ నుండి ఎందరు ముఖ్యమంత్రులైనా, మంత్రులైనా, ఎన్ని పార్టీలు మారినా రాయలసీమ ప్రజల సమస్య మాత్రం పరిష్కారం కావడంలేదు. నిత్యం కరువు కాటకాలతో, నీటి కొరతతో, వ్యవసాయ, పారిశ్రామిక సంక్షోభంతో అల్లాడి పోతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకునే వారే లేక బతుకు జీవుడా అంటూ వలన బాట పడుతున్నారన్నారు. వెంటనే ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు స్రవంతి, నారాయణ, విద్యార్థి, యువకులు పాల్గొన్నారు.

రోగులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని ప్రభుత్వ ఆసుపత్రి రోగులకు దుప్పట్లు, దిండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సోమవారం అమెరికాకు చెందిన మువ్వల సీతారామ అంజమ్మ, శంకు రాజేశ్వరిల మనమరాలు మువ్వల కుమారి యామిని సోమవారం ఆమె జన్మదిన సందర్భంగా కోట ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు దుప్పట్లు, దిండ్లు పంపిణీ చేశారు. పలువురికి అన్నదానం చేశారు. వీటిని సాయిబాబా మందిరం వారుసాయంగా అందించారు. ఈ కార్యక్రమంలో కోట ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రూప, సారంగం రమేష్ బాబు,సాయిబాబా మందిరం భక్తులు, పలువురు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న పింఛన్ల తనిఖీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా పరిధిలో ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్ల తనిఖీ కొనసాగుతోందని డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు తెలిపారు. తనిఖీలలో భాగంగా సోమవారం గూడూరు ఏరియా హాస్పిటల్, శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్, రూయా హాస్పిటల్స్ లో ఆరువలే పింఛన్ల క్యాటగిరి వినికిడి లోపం, దృష్టిలోపం, మానసిక వైకల్యం వర్గానికి చెందిన పింఛనుదారులు 50 చొప్పున మూడు చోట్ల 250 మందిని వైద్యుల సమక్షంలో పరీక్షించామన్నారు. గూడూరు ఏరియా హాస్పిటల్, శ్రీకాళహస్తి ఏరియా హాస్పిటల్ లో కేవలం దృష్టి లోపానికి సంబంధించిన క్యాటగిరి పింఛనుదారులను మాత్రమే పరిశీలించామని తెలిపారు. తిరుపతి రూయా ఆసుపత్రిలో ఆసుపత్రి పర్యవేక్షణ అధికారి డాక్టర్. రవి ప్రభు తో కలసి నిపుణుల వైద్యుల సాయంతో పింఛనుదారులను పరిశీలించామన్నారు.

రమాకాంత్ రెడ్డికి డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : వెల్లూరు, విట్ యూనివర్సిటీలోని కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగంలో పరిశోధన చేసిన బి రమాకాంత్ రెడ్డికి డాక్టరేట్ డిగ్రీని ఇచ్చినట్లు విట్ డీన్ తెలిపారు. ప్రస్తుతం ఆయన తిరుపతిలోని యస్వి ఇంజనీరింగ్ కళాశాలలో 10 సంవత్సరాల నుండి అసిస్టెంట్ ప్రొఫెసర్గా పనిచేస్తున్నారు. 'ఏ ఫ్రేమ్ వర్క్ ఫర్ హెల్త్ కేర్ ప్రొడక్ట్ క్లాసిఫికేషన్ అండ్ పర్సనలైజ్డ్ రికమెండేషన్స్ త్రూ డీప్ లెర్నింగ్ మోడల్స్' అనే అంశంపై డాక్టరు ఆర్ లోకేష్ కుమార్ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

ప్రజాశక్తి -కోట : కోట మండలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని కోట ఎమ్ ఈ ఓ దారా. మస్తానయ్య సోమవారం క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం పిల్లలకు అందించే గుడ్లను పరిశీలించడమే కాకుండా ఎలాంటి లోపాలు లేకుండా సక్రమంగా ఉండాలని మధ్యాహ్న భోజనం నిర్వాహకులకు తెలిపారు.

పాడి రైతుల కోసమే పశు ఆరోగ్య శిబిరం


పశువైద్య శిబిరం పోస్టర్ను ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: పాడి రైతుల సంక్షేమం కోసమే కూటమి ప్రభుత్వం పశుఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తోందని టిడిపి మండల అధ్యక్షుడు బెల్లంకొండ మురళి అన్నారు. చిట్టేచెర్ల పంచాయతీలో సోమవారం పశు సంవర్థక శాఖ నిర్వహించిన పశుఆరోగ్య శిబిరంలో పాల్గొని పశువులకు వైద్య పరీక్షలు చేయించిన రైతులతో మాట్లాడారు. పాడి అభివృద్ధికి ఎమ్మెల్యే నాని ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటు న్నారన్నారు. మిని గోకులాలు కావాలని అడిగిన రైతులకు అడిగిన వెంటనే మంజూరు చేయించారని పేర్కొన్నారు. వాటి నిర్మాణం దాదాపు పూర్తి అవుతు న్నాయని తెలిపారు.పాడి అభివృద్ధి విషయంలో ఏదైనా రైతులకు సమస్యలుంటే ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగచంగమ నాయుడు, ఏడీ రమణకుమార్, వెటర్నరీ డాక్టర్ స్రవంతి, పాడి రైతులు పాల్గొన్నారు.

కెవిబిపురం: కెవీబీపురం మండలంలోని రాయిపేడులో టిడిపి మండల అధ్యక్షుడు రామంజుల నాయుడు ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి హరీష్ మాట్లాడుతూ పశు వైద్య శిబిరంలో పశువులకు సంక్రమించిన వ్యాధులకు వైద్యం, ఎదకురాని, ఇతర గర్భకోశ వ్యాధులకు సైతం పరీక్షలు నిర్వహిస్తామన్నారు. పశువులకు నట్టల మందు తాగించడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరగడంతో పాటు పాల ఉత్పత్తి పెరుగుతుందన్నారు. గొర్రెలు, మేకలకు బొప్ప వ్యాధి నివారణ టీకాలు వేస్తామని తెలిపారు. పాడి పరిశ్రమ అభివృద్ధిలో భాగంగా గోకుల నిర్మాణలు, బహు వార్షిక గ్రాస క్షేత్రాలు, పశువుల బీమా, పశుకిసాన్ క్రెడిట్ కార్డులు వంటి పథకాలు అమలు చేస్తున్నారని ఆయన వివరించారు. పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసు కోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గోపినాథ్ రెడ్డి, సర్పం చ్ బాలాజీ, నాగరాజ్, ఉప సర్పంచ్ గురునా థం, నాగూర్, మని రైతులు పాల్గొన్నారు.

ఏర్పేడు: పాడి రైతులను ఆదుకునే నిమిత్తం ప్రతి గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామని ప్రతి ఒక్క పాడి రైతు వారి పశువుల ఆరోగ్య పరిస్థితులను మెరుగుపరుచుకోవాలని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి సూచించారు. బండారుపల్లి గ్రామంలో పశువైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ మినీ గోకులం పథకంను వినియోగించుకోవాలని కోరారు. ఇందులో భాగంగా క్యాంపు నిర్వహించి 195 పశువులకు, 66 దూడలకు, 88 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ, 42 పశువులకు సాధారణ వైద్య సేవలు, 3 పశువులకు కృత్రిమ గర్భధారణ, 14 గర్భకోశ వ్యాధుల చికిత్సలు, 353 పశువులకు పిడుదుల మందు పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డివారి గురవారెడ్డి, మైనారు పొన్నారావు, ధనంజీవులనాయుడు, శివశంకర్ రెడ్డి, మండల నాయకులు, డా. సునీత, డాక్టరు శిల్పా రెడ్డి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.


పాడి రైతులకు ఉచితంగా పశువుల మందులు అందిస్తున్న దృశ్యం

ఏర్పేడు: బండారుపల్లిలో ఎమ్మెల్యే బొజ్జల సుధీర్రెడ్డి పశువైద్య శిబిరాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మినీ గోకులం పథకంను వినియోగించుకోవాలన్నారు. ఇందులో భాగంగా క్యాంపు నిర్వహించి 195 పశువులకు, 66 దూడలకు, 88 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ, 42 పశువులకు సాధారణ వైద్య సేవలు, 3 పశువులకు కృత్రిమ గర్భధారణ, 14 గర్భకోశ వ్యాధుల చికిత్సలు, 353 పశువులకు పిడుదుల మందు పిచికారీ చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డివారి గురవారెడ్డి, మైనారు పొన్నారావు, ధనంజీవులనాయుడు, శివశంకర్ రెడ్డి, మండల నాయకులు, డాక్టరు సునీత, డాక్టరు శిల్పారెడ్డి, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రామచంద్రపురం: పాడి రైతుల సంక్షేమానికే ప్రభుత్వం గ్రామాలలో పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నదని మండల టిడిపి అధ్యక్షుడు ఎం తిరుమలరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని అనుపల్లి పంచాయతీ బొప్పరాజు పల్లి గ్రామంలో మండల పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పాడి రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నదని పేర్కొన్నారు. ప్రభుత్వం పాడి రైతులకు మంజూరు చేసు గోకులం షెడ్లను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ జయ కిషోర్, కిరణ్ కుమార్, ఏపీవో హంస వేణి, టిడిపి నాయకులు చేకూరు జనార్దన్ చౌదరి, పంతల వెంకటేష్ నాయుడు,సిద్దయ్య, ప్రకాష్, సోము, యోగ, నాగార్జున్, సర్పంచ్ గోవర్ధన్, విజయ్ కుమార్ రెడ్డి, జి మహేష్, కుమార్, బి కోటీశ్వర్ రెడ్డి, మురళీమోహన్ రెడ్డి, పాడి రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత కేన్సర్ వైద్య పరీక్షలు చేయించుకోవాలి

- వైద్యాధికారి డాక్టర్ రాగసుధ

ప్రజాశక్తి -నారాయణవనం: రొమ్ము కేన్సర్ను ప్రాథమిక దశలో గుర్తించేందుకు వీలుగా 35 ఏళ్లు దాటిన మహిళలందరూ ఉచిత వైద్య పరీక్షలు చేయించుకోవాలని నారాయణవనం వైద్యాధికారి డాక్టర్ రాగసుధ కోరారు. స్విమ్స్ ఆధ్వర్యంలో సోమవారం నారాయణవనం పిహెచ్ సి పరిధిలోని కీళగరం సచివాలయం, అరణ్యంకండ్రిగ పంచాయతీ జిఎన్ కండ్రిగ ఎంపియుపి పాఠశాలలో ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా మొబైల్ కేన్సర్ స్క్రీనింగ్ వేగంగా నిర్వహిస్తున్నారన్నారు. పింక్ బస్సులో మహిళలు, పురుషులకు నోటి క్యాన్సర్ పరీక్షలు, మహిళలకు రొమ్ము క్యాన్సర్ కోసం మామోగ్రామ్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ కోసం పాప్ స్మియర్ పరీక్షలను ఉచితంగా నిర్వహించారు. మహిళలు, పురుషులు అధిక సంఖ్యలో కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకున్నారు. 21వ తేదీ కశింమిట్ట, వెంకటకృష్ణపాలెం, జనవరి 23న భీమునిచెరువు, నారాయణవనం-3, జనవరి 24న ఎరికంబట్టు, నారాయణవనం-2, 27న కొండలచెరువులో మొబైల్ కేన్సర్ స్క్రీనింగ్ శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ చైతన్య భాను, సర్పంచులు విజయ షణ్ముగం, రామ్మూర్తి, మురళి, పంచాయతీ కార్యదర్శులు ఉదయకుమార్, సుకుమార్, స్థానిక నాయకులు రవి, యూరప్ప, శ్రీనివాసులు, బాలచంద్ర నాయుడు, కందస్వామి నాయుడు, జయచంద్ర నాయుడు, హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఎంల్ హెచ్ పిలు శ్రావణి, జయశ్రీ, ఏఎన్ఎంలు పద్మావతి, సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.